వితంతు పింఛన్ల మంజూరులో మతలబు

పలువురు వితంతువుల ఆగ్రహం

విశాలాంధ్ర – పార్వతీపురం: జిల్లాలో కొత్తగా 1,521 మంది వితంతువులకు జీవిత భాగస్వామి పింఛన్లు (స్పౌజ్ పింఛన్లు) మంజూరైనట్లు జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ శుభవార్తగా తెలియజేసి నప్పటికీ జిల్లాలో ప్రతి మండలంలో అర్హులైనటువంటి వితంతువులు మరో 3 వేలమందికి పైగా ఉన్నప్పటికీ తమకు ఎందుకు మంజూరు చేయలేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అర్హులైన వితంతువులు పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలియజేయాల్సిన ప్రభుత్వం అలా చేయకుండా 2023 డిసెంబర్ 1 నుంచి 2024 అక్టోబర్ 31మధ్య కాలంలో వితంతువులైన వారికి జీవిత భాగస్వామి పింఛన్లను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వమే కొన్నిపేర్లను నేరుగా పంపించడంలో ఉన్న ఆంతర్యం ఏమిటని వితంతు మహిళలు ఊగిపోతున్నారు. ఎన్నికల నోటిఫికేషన్‌కు రెండునెలల ముందునుండి నేటివరకు వేలాదిమంది అర్హులైన వితంతువులు ఉన్నప్పటికీ కేవలం 1521 మందిని మాత్రమే అర్హత చూపించి నేరుగా మంజూరు చేయడంలో ఉన్న మతలబు ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. జిల్లాలోని 15 మండలాల్లోనూ, పాలకొండ, పార్వతీ పురం, సాలూరు నగరపాలక, పురపాలక సంస్థలలో పూర్తిస్థాయిలో అర్హులైన వారిని దరఖాస్తు చేసుకోమంటే మరో 3వేలకు పైగా వితంతువులు ఉన్నారని స్పష్టంగా తెలుస్తుంది. ప్రభుత్వం ఇప్పటికైనా దృష్టిసారించి జూన్ నెలలో ఇచ్చే పెన్షన్‌కు సంబంధించి అర్హులైన వారి దరఖాస్తులను మే నెలలో తీసుకొని న్యాయం చేయాలని వారంతా విజ్ఞప్తి చేస్తున్నారు. సుమారు పది నెలల నుండి పెన్షన్ రాక కుటుంబాన్ని పోషించుకోలేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని పలువురు వితంతువులు తమ గోడును విశాలాంధ్ర ముందు వ్యక్తం చేశారు. చాలా గ్రామాల్లో అర్హులైన వారు చాలామంది స్పౌజ్ వితంతువులు ఉన్నారని, పూర్తిస్థాయిలో మంజూరు చేయక కొద్దిమందికి ఇవ్వడం వలన తామంతా ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకొని ఉమ్మడి ప్రభుత్వాన్ని గెలిపించుకోగా తమకు నష్టం జరిగిందని వారంతా లబోదిబోమంటున్నారు. పూర్తిస్థాయిలో అర్హులైన పెన్షన్లను అందజేసి తమను ఆదుకోవాలని వారంతా వినయపూర్వకంగా కోరుతున్నారు.

వెంకటాపురంలో మట్టి పరీక్షలు

విశాలాంధ్ర – సీతానగరం: మండలంలోని వెంకటాపురం గ్రామంలో మండల వ్యవసాయ అధికారి అవినాష్ ఆధ్వర్యంలో గ్రామ వ్యవసాయ సహాయకులు మట్టి పరీక్ష నిమిత్తం మట్టి నమూనాలు తీయడం జరిగింది. మండలం మొత్తంగా 1244 నమూనాలు తీయవలసి ఉండగా ఇప్పటి వరకు 182 నమూనాలు తీయడం జరిగిందని, మిగిలిన నమూనాలు తీయడం జరుగుతుందని తెలియజేశారు. మొదటిగా నమూనా సేకరించే క్షేత్రంను ఎంచుకోవాలని, తర్వాత ఎకరానికి 8 చోట్ల రాండమ్‌గా నమూనా సేకరించాలని, తర్వాత 15 సెంటి మీటర్లు లోతులో వి ఆకారంలో గుంట తీసుకోవాలన్నారు. తర్వాత కింద నుండి పైవరకు అన్ని పొరలలో మట్టి వచ్చేలా అన్ని చోట్ల మట్టి తీసుకోవాల న్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

నాగాలాండ్ బృందం సందర్శన

విశాలాంధ్ర – పార్వతీపురం రూరల్: మండలంలోని డోకిశీల సెక్టార్ పరిధిలో గల గోచక్క గ్రామంలో అంగన్వాడి కేంద్రం 1,2, చినబొండపల్లి-1 కేంద్రాలను ప్రాజెక్ట్ డైరెక్టర్ కనకదుర్గ ఆధ్వర్యంలో నాగాలాండ్ బృందం సందర్శించారు. చిన్నారులకు, గర్భిణీలకు, బాలింతలకు ప్రభుత్వ అందజేస్తున్న పౌష్టికాహారం వారి ఆరోగ్య విషయాలపై బృంద సభ్యులు ఆరా తీశారు. కేంద్రాలకు వస్తున్న చిన్నారుల ఎదుగుదలతో పాటు గర్భిణీలకు ప్రభుత్వం ఇస్తున్న పౌష్టికాహారం అలాగే ప్రసవ సమయంలో తీసుకున్న జాగ్రత్తలపై బృంద సభ్యులు హబీబు, లాంగ్ కుహం, మోహపు తదితరులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసినట్లు సీడీపీఓ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని అంగన్వాడీ కేంద్రాల పనితీరును పరిశీలించేందుకు వచ్చిన నాగాలాండ్ బృంద సభ్యులకు అంగన్వాడి కార్యకర్తలు ఘనంగా ఆహ్వానించారు.

ఎంఎస్ఆర్ ఫౌండేషన్ నిధులతో రహదారి మరమ్మతులు

విశాలాంధ్ర – మక్కువ: మండలంలో వెంకటభైరిపురం గ్రామం నుండి కంతపోలమ్మ గుడి మీదుగా డి.శిర్లాం గ్రామానికి వెళ్లే రోడ్డు సుమారు ఒక కిలోమీటరు దూరం మేరకు మరమ్మతులకు గురి కావడం వల్ల, గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు ఎంఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు మరడ శ్రీనివాసరావు స్పందించి తన సొంత నిధులు సుమారు 50000 రూపాయలు ఖర్చుతో దగ్గర వుండి మరమ్మతులు చేయించారు.

మరడ సాయిరాం, రెడ్డిశ్రీరాం, పాము అప్పలస్వామి, జాగాన శ్రీను (డి.శిర్లాం), దాసరి వెంకటరమణ, తీళ్ల రామకృష్ణ, జాగాన తిరుపతి నాయుడు, గేదెల తిరుపతినాయుడు, గుల్ల సింహాచలం, వురిటి సింహాచలం, తంగుడు తవిటినాయుడులకు ఎంఎస్ఆర్ ఫౌండేషన్ ప్రత్యేకంగా పేరు పేరునా ధన్యవాదాలు తెలిపారు.

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర – కురుపాం: ఈనెల 30వ తేదీన కలెక్టరేట్‌లో వీఆర్ఏల సమస్యలపై ధర్నా చేపట్టనున్న నేపథ్యంలో ముందస్తుగా తహశీల్దార్ ఎం.రవణమ్మకు సోమవారం వీఆర్ఏల సంఘ జిల్లా అధ్యక్షులు జి.ఈశ్వరరావు ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్ఏల దీర్ఘకాలిక సమస్యలైన పే స్కేల్స్, అర్హత ఉన్న వారికి ప్రమోషన్లు తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్లతో కూడిన వినతి అందించారు. ఈ మేరకు ధర్నా చేపడుతున్నట్టు తెలిపారు. ఈ ధర్నాలో వీఆర్ఏలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

భూ కబ్జాదారులకు కొమ్ము కాస్తున్న రెవెన్యూ

సీపీఐ జిల్లా కార్యదర్శి కూరంగి

విశాలాంధ్ర – సీతంపేట/భామిని: మండలం లివిరి గ్రామ దళితుల యొక్క భూములను సర్వే చేసి ఇవ్వడానికి రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని పార్వతీపురం మన్యం సీపీఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మథరావు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తేదీ 26.04. 2025న లివిరి గ్రామ రెవెన్యూ అధికారి వీఆర్ఓ తమ యంత్రాంగం వచ్చి లివిరి గ్రామంలో గల 30 ఎకరాలు భూమి కబ్జాదారుల ఆక్రమణలో ఉన్న నేపథ్యంలో దళిత భూములను సర్వే చేసి వాళ్లకి అప్పజెప్పుతామని సమాచారం ఇచ్చారని అన్నారు. అయితే ఆ గ్రామ రెవెన్యూ అధికారి వారి మాటలకు గౌరవం ఇచ్చి ఆ దళితులు భూములు దగ్గరికి ఆ గ్రామ రైతులతో వెళ్లామని, అక్కడికి వెళ్లి ఎంతసేపు ఉన్నా సరే రెవెన్యూ సిబ్బంది రాలేదని, ఆ గ్రామ రెవెన్యూ అధికారికి ఫోన్ చేసి అడిగితే అతను నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని అన్నారు. అయితే మండల రెవెన్యూ అధి కారులలో ఇంత నిర్లక్ష్య ధోరణికి పాల్పడం చాలా అన్యాయం అన్నారు. ఈ లివిరి గ్రామ దళిత భూములను వాళ్లకు న్యాయం జరిగేంతవరకు సీపీఐ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అల్లిబోయిన అప్పలనాయుడు, పి.శంక రావు, కూరంగి జగదీష్ నాయుడు పాల్గొన్నారు.

బామినికి బస్సులు నడపాలి: సీపీఐ

విశాలాంధ్ర – పార్వతీపురం టౌన్: జిల్లాలోని పార్వతీపురం బస్ స్టేషన్ నుండి బామినికి, మారుమూల గిరిజన గ్రామాలకు, కొన్ని మండల కేంద్రాలకు, కొన్ని ముఖ్యమైన గ్రామాల వరకు బస్సు సౌకర్యాలు పెంచాలని సీపీఐ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఆర్టీసీ జిల్లా కార్యాలయంలో డీపీటీఓ సీనియర్ అసిస్టెంట్ ఎస్.సింహాచలంకి సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్నతో పాటు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బుడితి అప్పలనాయుడు, గరుగుబిల్లి సూరయ్య, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం బామిని మండల కార్యదర్శి కొత్తకోట బాబురావు నాయుడు కలిసి మెమోరాండం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో అనేక పనుల కోసం ఉద్యోగస్తులు, వ్యాపారస్తులు, ప్రజలు, విద్యార్థులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారని, జిల్లాలో ఎక్కువ ప్రాంతం ఏజెన్సీ ప్రాంతం కావడం వలన మారుమూల ప్రాంతాల నుండి బస్సు సౌకర్యాలు లేకపోవడంతో చుట్టూ తిరిగి రావడం జరుగుతుందని, బామిని నుండి పార్వతిపురం రావాలంటే కొత్తూరు, సీతంపేట, పాలకొండ వెళ్లి, పాలకొండ నుండి పార్వతీపురం రావడం వలన ఎంతో సమయం, డబ్బులు వృధా అవుతుదన్నారు. కావునా తక్షణమే భామిని గ్రామానికి బస్ సర్వీస్ నడపాలన్నారు.

కార్పొరేట్‌కు ధీటుగా మెరుగైన విద్య

విశాలాంధ్ర – జియ్యమ్మవలస: విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు ఉత్తమ ఫలితాలు అందించి వారి తల్లిదండ్రుల మన్ననలు పొందుతున్న చినమేరంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ముత్యాలు తన సిబ్బందితో కలసి పాఠశాలకు సమీప గ్రామాలైన అల్లువాడ, తుంబలి, దాసరిపేట, చినమేరంగి, లింగాలవలస తదితర గ్రామాలకు ఆటోలు, కార్లతో వెళ్లి ఆరు నుండి పది వరకు చదువుకొనే వయసు గలిగిన విద్యార్థులకు ఆహ్వానిస్తూ ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. ప్రైవేటు పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ విద్యతో పాటు మంచి ఫలితాలను ఇస్తూ పరిసరాలు, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని ముత్యాలు తెలిపారు. కార్యక్రమంలో ఆయనతో పాటు ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు సకాలంలో పరిష్కరించండి

విశాలాంధ్ర – సీతంపేట: ఐటీడీఏలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఐటీడీఏ పీవో సి.యశ్వంత్ కుమార్ రెడ్డి సోమవారం నిర్వహించారు. గ్రీవెన్స్‌కు 33 వినతులు రాగా సకా లంలో పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. మెలియాపుట్టి మండలం గొద్ద గ్రామానికి చెందిన పెద్దింటి పోలమ్మ తనకు వితంతు పింఛన్ మంజూరు చేయాలని వినతి పత్రం సమర్పించారు. కొత్తూరు మండలం ఎగువ దొండమాను గూడ గ్రామస్తులు గ్రామానికి త్రాగునీరు బోరు మంజూరు చేయాలని వినతి పత్రం సమర్పించారు. చాపరాయి గూడ గ్రామానికి చెందిన ఆరిక ఎల్లారు సీసీ రోడ్డు మంజూరు చేయాలని వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో జి.చిన్నబాబు, ఈఈ రమాదేవి, డిడి అన్నదొర, పీహెచ్ఓ వెంకట గణేష్, డిప్యూటీ డీఈఓ కుమార్, వెలుగు ఏపీడీ, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

నగర పంచాయతీ చైర్‌పర్సన్‌గా ఆకుల మల్లీశ్వరి

విశాలాంధ్ర – పాలకొండ: పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ నగర పంచాయతీ చైర్మన్‌గా రెండవ వార్డుకు చెందిన ఆకుల మల్లేశ్వరి ఎంపికయ్యారు. సోమవారం జరిగిన నగర పంచాయతీ చైర్‌పర్సన్ ఎన్నికలలో అధికారులు కోరంతో సంబంధం లేకుండా ఎన్నికలు నిర్వహించారు. కూటమి తరుపున ఐదుగురు కౌన్సిలర్లు ఎక్స్ అఫీషియల్ సభ్యుడుగా ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ హాజరయ్యారు. ఇటీవలే వైసిపి నుంచి టిడిపిలో చేరిన ఆకుల మల్లేశ్వరి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. టిడిపికి చెందిన ఆరో వార్డు కౌన్సిలర్ అడపా జయ ఆమెను ప్రతిపాదించగా 20వ వార్డు కౌన్సిలర్ గంటా వరలక్ష్మి బలపరిచారు. ఒకే ఒక్క నామినేషన్ దాఖలు కావడంతో అది కూడా ఎస్సీ రిజర్వుడ్ కావడంతో చైర్మన్‌గా ఆకుల మల్లేశ్వరిని ప్రకటిస్తూ ఎన్నికల అధికారిగా వ్యవహరించిన జెసి శోభిక ధ్రువీకరణ పత్రం అందజేశారు. ఈ ఎన్నికను వైసీపీకి చెందిన 14 మంది కౌన్సిలర్లు గైరాజరయ్యారు. కాగా తమ పార్టీ నుంచి వీడి టిడిపిలో చేరిన సాంకేతికంగా ఆకుల మల్లేశ్వరి తమ పార్టీకే చెందిన వారంటూ ఆమెనే తమ పార్టీ తరపున చైర్మన్ అభ్యర్థిగా ప్రకటిస్తున్నామంటూ వైసీపీ నాయకులు ఆకుల మల్లీశ్వరిని బలపరుస్తూ బీఫారం అందజేశారు. ఎవ్వరు హాజరు కారంటూ విప్ సైతం జారీ చేశారు. ఎన్నిక ప్రక్రియ ముగిసిన అనంతరం జిల్లా మంత్రి గుమ్మడి సంధ్యారాణి నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలో నూతన చైర్మన్‌ను అభినందించారు. పాలకొండ అభివృద్ధి ఇక పరుగులు పెడుతుందని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో జీసిసి అధ్యక్షుడు కిడారి శ్రావణ్, టిడిపి ఇన్చార్జి పడాల భూదేవి, పట్టణ అధ్యక్షుడు గంట సంతోష్ కుమార్, టిడిపి సీనియర్ నాయకులు పల్లా కొండబాబు, నాలుగో వార్డ్ కౌన్సిలర్ గంగు నాయుడు, కమిషనర్ రత్న రాజ్, మేనేజర్ జయరాం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఎన్నిక సందర్భంగా డిఎస్పి ఎం.రాంబాబు ఆధ్వర్యంలో సీఐ ఎం.చంద్రమౌళి, ఎస్సై ప్రయోగమూర్తి పర్యవేక్షణలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

దేశీయ విత్తనాల వారసత్వ సంపదను కాపాడుకోవాలి

ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకర్రావు

విశాలంతా – చింతపల్లి: దేశీయ విత్తనాల వారసత్వ సంపదను కాపాడుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకర్రావు అన్నారు. సిఫా, వాసన్, ఆర్ ఆర్ ఎ ఎన్ సంస్థల ఆధ్వర్యంలో అల్లూరి జిల్లాలోని చింతపల్లి మండలంలోని లమ్మసింగిలో అంతర్జాతీయ ఆదిమ విత్తనాలు పండుగ నిర్వహించిన అనంతరం సోమవారం ఆయన అయిదు వందల విత్తనాలతో సిఫా నిర్వహించిన ప్రదర్శనను తిలకించిన అనంతరం ఆయన మాట్లాడారు. భవిష్యత్తు తరాలకు ఆస్తిగా మన ఆదిమ విత్తన సంపత్తి మనమే కాపాడుకోవాలని సూచించారు. పంచాయతీ పరిధిలో 12 గ్రామాలను భారత దేశీయ విత్తనాల గ్రామాలుగా (ఇండియన్ ఇండీజీనియస్ సీడ్ విలేజెస్) తీర్చిదిద్దే కార్యక్రమం అభినందనీయమన్నారు. ఆంధ్రా యూనివర్సిటీ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ రాజు మాట్లాడుతూ దేశంలో వ్యవసాయం మొదలైన పదివేల సంవత్సరాలు కిందటి కాలంలోని విత్తనాలు, దేశంలోని అన్ని మారుమూల ప్రాంతాల్లో నుంచి సేకరించి ఇక్కడ గ్రామాల్లో నాటి పెంచడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి తహశీల్దార్ రవికుమార్, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, ఎపి బయోడైవర్సిటీ బోర్డు ప్రాంతీయ సమన్వయకర్త జానకీరావు, నీత్ అయోగ్ ప్రతినిధులు నారాయణ రెడ్డి, చైతన్య రెడ్డి, సిఫా సంస్థ సిఇఒ డాక్టర్ శశిప్రభ. వాసన్ అసోసియేట్ డైరెక్టర్ సన్యాసిరావు, హీఫర్ ఇంటర్నేషనల్ ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ సునీత, ఆర్ ఆర్ ఎ నెట్వర్క్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎం.లీలావతి, సంజీవని సంస్థ ప్రతినిధి దేవుళ్ళు, గ్రీన్ క్లైమేట్ టీం ప్రతినిధి జెవి రత్నం తదితరులు ప్రసంగించారు.

స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ తక్షణమే విడుదల చేయాలి

30న పాడేరు ఐటీడీఏ వద్ద ధర్నా మే 2 నుండి నిరవధిక బంద్

విశాలాంధ్ర – పాడేరు: ఆదివాసి ప్రాంతంలో ప్రత్యేక స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని, ఆదివాసి ప్రాంతంలో 100కు 100శాతం ఉద్యోగాలను ఆదివాసులకు ఇవ్వాలని ఆదివాసి స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ కన్వీనర్ దన్నేటి పలాసి శంకర్ డిమాండ్ చేశారు. పాడేరు గిరిజన ఉద్యోగుల భవనంలో సోమవారం రౌండ్ టేబుల్ సమావేశంలో కో కన్వీనర్ పాత్రుడు రాధ మాట్లాడుతూ ఆదివాసులకు మెగా డీఎస్సీ తీవ్ర అన్యాయం చేసిందని, సీఎం నారా చంద్రబాబు అరకు ఎన్నికల్లో భాగంగా ఇచ్చిన హామీ తక్షణమే నిలబెట్టుకోవాలని, ఆదివాసి ప్రాంతంలో తక్షణమే స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలంటూ 30వ తేదీన పాడేరు ఐటీడీఏ వద్ద ధర్నాకు నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున తరలిరావాలని అన్నారు. అదేవిధంగా స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ సాధనకై మే 2వ తేదీ నుండి నిరవదిక బంద్‌ను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కిల్లో రాజారావు, రొబ్బ ప్రశాంత్ కుమార్, మొండిపల్లి చిరంజీవి, వంతాల నాగేశ్వరరావు, కర్ర వై.కుమార్, కూడ రాధాకృష్ణ, కొర్ర చిన్నారి, సోమేలి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

మే 2న బంద్‌ను జయప్రదం చేయాలి

ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి పిలుపు

విశాలాంధ్ర – పాడేరు: షెడ్యూల్ ఆదివాసీ ప్రాంతంలో ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ నోటిపికేషన్ విడుదల చేయాలని మే 2న జరిగే మన్యం బంద్‌కు మేధావులు, గిరిజన ఉద్యోగులు, ప్రజలు, మహిళలు, యువత, విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జిల్లా సమితి నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజశేఖర్ మీడియాతో మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మెగా డీఎస్సీ ఆదివాసులకు తీవ్ర అన్యాయం జరిగిందని, అరకులో ఎన్నికల సభలో ఆదివాసీ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి జీవో నెంబర్ 3 చట్టబద్ధత కల్పిస్తామని ఆదివాసులకు హామీ ఇచ్చారని, కానీ మెగా డీఎస్సీలో ఆదివాసులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. పాడేరు ఐటీడీఏ పరిధిలో గిరిజన సంక్షేమ శాఖలో 400 పోస్టులు నోటీ ఫై చేశారని ఆదివాసులకు కేవలం ఆదివాసులకు 24 పోస్టులు కేటాయించి నోటిఫికేషన్ విడుదల చేశారని, ఇందులో 70 శాతం ఉద్యోగాలు ప్రమోషన్ ద్వారా ఇస్తారని, ఆదివాసులకు వచ్చిన 24 పోస్టుల్లో 16 పోస్టులు ప్రమోషన్ ద్వారా ఇస్తారని, 8 పోస్టులకు మాత్రమే గిరిజనులు పోటీ పడాలన్నారు. కావున గిరిజనులకు మెగా డీఎస్సీ వల్ల ఉపయోగం లేదని, ఆదివాసి షెడ్యూల్ ప్రాతంలో 1/70 చట్టం ప్రకారం శాశ్వత నివాసాలకు అనుమతి లేని గిరిజనేతరులకు 376 పోస్టులు కేటాయించడం ఆదివాసులకు తీరని అన్యాయం అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు వి.కృష్ణ, బాలు, జగదీశ్, చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

30న డీఎస్సీ అభ్యర్థుల ఐటీడీఏ ముట్టడి

విశాలాంధ్ర – జి.మాడుగుల: మండల కేంద్రంలో డీఎస్సీ అభ్యర్థులు సమావేశం అయ్యారు. ఈ సమావేశం సందర్భంగా మత్స్యరాస నారాయణరాజు మాట్లాడుతూ ఇటీవల ప్రకటించిన డీఎస్సీ నోటిఫికేషన్లో తీవ్ర అన్యాయానికి గురైన అభ్యర్థులు వివిధ కోచింగ్ సెంటర్స్‌లోను, స్టడీ రూమ్స్‌లోనూ డీఎస్సీకి ప్రిపేర్ అవుతున్న ప్రతి ఒక్కరు 30వ తేదీన ఐటీడీఏ ముట్టడి కార్యక్రమానికి హాజరు అవ్వాలని తెలిపారు. కనీస పోస్టులు లేకుండా డీఎస్సీకి ప్రిపేర్ అవడం అభ్యర్థుల అవివేకమని తెలిపారు. జీవో నెంబర్ 3 కేవలం ఉపాధ్యాయుల పోస్టులకే పరిమితం కాదని, షెడ్యూల్ ప్రాంతంలో తీసే ప్రతి నోటిఫికేషన్‌లో వర్తిస్తుందని తెలిపారు. గిరిజన ప్రాంతంలో 100% ఉద్యోగ రిజర్వేషన్ కల్పించాలని, గిరిజన ప్రాంత పోస్టులను మెగా డీఎస్సీలో మినహాయించాలని తెలిపారు. గత ఐదు సంవత్సరాలు జీవో నెంబర్ 3 ద్వారా అవగాహన కల్పించినప్పటికీ కొంతమంది తప్పుదోవ పట్టించడం వల్ల నేటి నిరుద్యోగులు ముందుకు రాలేదన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్సీ సాధన కమిటీ కో కన్వీనర్ పాంగి మత్యరాజు, డిఈడి అభ్యర్థులు ఉమామహేష్, నాగేంద్ర, గణేష్, వందు ఫార్మసిస్ట్ కామేష్, పాల్గొన్నారు.

మారెమ్మ చల్లనీటి ఉత్సవం



విశాలాంధ్ర – సీలేరు: జీకేవీధి మండలం సీలేరు మారెమ్మ 53వ వార్షిక మహోత్సవాల్లో భాగంగా సోమవారం చల్లనీటి ఉత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగిస్తూ గ్రామంలో పసుపు నీళ్లు చల్లుతూ చల్లనీటి ఉత్సవంను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మారెమ్మ అమ్మవారి మాలలు ధరించి దీక్షలను చేపట్టిన భక్తులు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గన్నారు. అనంతరం అమ్మవారి ఉత్సవాల సందర్భంగా తయారు చేసిన గరగను సీలేరు రిజర్వాయర్‌లో నిమజ్జనం చేశారు.

మే డే వారోత్సవాలు జయప్రదం చేయండి

విశాలాంధ్ర – కూనవరం: మే డే సందర్భంగా ప్రతి గ్రామ శాఖలో పార్టీ జెండాను ఎగరవేయాలని పార్టీ క్యాడర్ బలోపేతానికి కృషి చేయాలని సీపీఐ డివిజన్ కార్యదర్శి కామ్రేడ్ గుజ్జ మోహన్ రావు, మండల కార్యదర్శి కామ్రేడ్ లంబు శ్రీనివాసరావు అన్నారు. సోమవారం కూనవరం లోని పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ ప్రస్థానంలో మేడే ఎంతో కీలకమైనదని కాబట్టి మే ఒకటి నుంచి ఏడు వరకు ప్రతి గ్రామ శాఖలో పార్టీ జెండా ఎగిరేలా చూడాలని దానికి కార్యకర్తలందరూ కృషి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు జుట్టుక సూర్యచంద్రరావు, సురేష్, సూరం వెంకటేశ్వర్లు, సూరం ముత్యం, పుట్టి కృష్ణార్జునరావ్, పుట్టి గణపతి, బుడిపిటి వెంకటేశ్వర్లు, శాఖ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

జనసైనికుల క్రియాశీల సభ్యత్వ కిట్లు అందజేత

విశాలాంధ్ర – కొయ్యూరు: జన సైనికుల కుటుంబాలకు అండగా ఆసరాగా నిలిచేందుకు ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన క్రియాశీల సభ్యత్వ కిట్లు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు గూడెం లక్ష్మణ్, గౌరవ అధ్యక్షుడు సాగిన బుజ్జిబాబు తెలిపారు. సభ్యత్వ నమోదు చేసుకున్న జనసైనికులవఅ సభ్యత్వ కిట్లు పాడేరు జనసేన పార్టీ కార్యాలయంలో అరకు పాడేరు నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ వంపూరు గంగులయ్య సమక్షంలో తమకు అందజేయడం జరిగిందని తెలిపారు. క్రియా శీలక సభ్యత్వం నమోదు చేసుకున్న జనసైనికులకు రెండు మూడు రోజుల్లో సమావేశం ఏర్పాటు చేసి సభ్యత్వ కిట్లు అందజేయడం జరుగుతుందని అలాగే సభ్యత్వం నమోదు చేసిన క్రియాశీల వాలంటీర్ చేత ప్రతి ఒక్క జన సైనికుడికి అందే విధంగా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన పార్టీ కార్యదర్శి గూడెం శేషుబాబు, వైస్ ప్రెసిడెంట్ పోట్టిక రాంప్రసాద్, మండల ఆర్గనైజర్ పీటా సుధీర్, జీకే వీధి మండలం అధ్యక్షుడు కొయ్యం బాలరాజు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం డోలీతో తరలింపు

విశాలాంధ్ర – జి.మాడుగుల: మండలంలోని బొయితిలి పంచాయతీ జాములవీధి గ్రామానికి చెందిన లొంబోరి రవన్నబాబు సోమవారం పాయిజన్ తాగి ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే మేల్కొన్న కుటుంబ సభ్యులు 108 వాహనానికి ఫోన్ చేయగా డ్రైవర్ అందుబాటులో లేదని సిబ్బంది చెప్పడంతో సూరిమెట్ట వరకు 2కిలో మీటర్లు వరకు డోలీకట్టి తరలించారు. అదే సమయంలో అత్యవసర 108 వాహనం అందుబాటులో రావడంతో ఆపస్మరక స్థితికి చేరుకున్న రవన్నబాబుకు పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్య సిబ్బంది చెప్పారు.

గిరిజనుల భూముల అన్యాక్రాంతంపై ఫిర్యాదు చేస్తాం: ఎమ్మెల్యే

విశాలాంధ్ర – అనంతగిరి: మండలంలోని గిరిజనేతర పంచాయతీలు భూములపై సమగ్ర దర్యాప్తు జరిపి రియల్ ఎస్టేట్ వ్యాపారం నుంచి గిరిజనులకు రక్షణ కల్పించాలని అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం డిమాండ్ చేశారు. ఆయన సోమవారం అనంతగిరి ఎంపీపీ శెట్టి నీలవేణి, జెడ్పిటిసి దీసరి గంగరాజు, వైసీపీ అధ్యక్షులు కొర్రా సూర్యనారాయణ, సర్పంచ్ ఫోరం అధ్యక్షులు పాగి అప్పారావు నియోజవర్గ నాయకులతో కలిసి భీంపోలు పంచాయతీ సర్యపల్లి రెవెన్యూ పరిధిలో ఎటోర్ వెంచర్స్‌లో భూములు పరిశీలించి ఆక్రమణలను గుర్తించారు. భీంపోలు ఉపసర్పంచ్‌కు చెందిన భూమిని ఎటోర్ వెంచర్స్ దౌర్జన్యంగా ఆక్రమించుకొని యంత్రాలతో ఉన్న అరటి తోటలను ధ్వంసం చేసి చదును చేశారన్న ఫిర్యాదు మేరకు ఆయన ఆ ప్రాంతాన్ని సందర్శించారు. అలాగే పలు ప్రభుత్వ భూములను, సీలింగ్ భూములను, గెడ్డ పోరంబోకు,డీఫారం భూములను తమ ఆధీనంలోకి తీసుకొని ఆక్రమించుకొని ఇష్టారీతిన రోడ్లు, వంతెనలు నిర్మిస్తున్నారని డిఫారం భూములను చదును చేసి వ్యాపార పరంగా వినియోగించుకుంటున్నారని స్థానికులు ఆయనకు తెలియజేశారు. గిరిజనుల భూములు కాజేస్తున్న వ్యక్తులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని అదే విధంగా ప్రభుత్వ గిరిజనుల భూములను పరిరక్షించే బాధ్యత రెవెన్యూ అధికారులు తీసుకోవడంలో విఫలమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీ రామ్మోహన్ నాయుడు, మినిస్టర్ అచ్చం నాయుడు, హోం మినిస్టర్ అనిత వంటి వారి పేర్లతో రియల్ వ్యాపారాలు చేసి ఇక్కడి వారిని బెదిరిస్తున్నారని, ఈమేరకు ఆ కూటమి నాయకులు స్పందించాలన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి సంబంధిత గిరిజనేతర పంచాయతీలలో సమగ్ర దర్యాప్తు జరిపి అన్యాక్రాంతమైన భూములను గిరిజనులకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో భీంపోలు ఎంపీటీసీలు శిరగం అశోక్, కెలాయి తవిటి నాయుడు, ఉపాధ్యక్షులు పాడి కృష్ణమూర్తి, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహేష్, అప్పలకొండ, కన్నయ్య, ఈశ్వర్ సిపిఎం నాయకులు జేష్ట రమణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో విస్తృతంగా స్ప్రేయింగ్

విశాలాంధ్ర – చింతూరు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గిరిజన గ్రామలైన తులసిపాక బొడ్రాయిగూడెం, రామన్న పాలెంలో స్ప్రేయింగ్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. దోమల మందు పిచికారి కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వి.నిఖిల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమతెరలు వాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వి.నిఖిల్, సూపర్వైజర్, హెల్త్ అసిస్టెంట్, ఆశాలు పాల్గొన్నారు.

విచ్చల విడిగా ప్లాస్టిక్ వినియోగం

పట్టించుకోని అధికారులు
జిల్లా కలెక్టర్ ఆదేశాలు బేఖాతార్

విశాలాంధ్ర – రంపచోడవరం: అల్లూరి సీతా రామ రాజు జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో ప్లాస్టిక్‌పై నిషేధం విధిస్తున్నట్లు అల్లూరి కలెక్టర్ దినేష్ కుమార్ నెల రోజుల క్రితం ఆదేశాలు జారీ చేశారు. అధికారులు కూడా వెంటనే గ్రామ గ్రామానికి ఆటోలో మైక్‌ల ద్వారా ప్రచారం చేశారు. సచివాలయం సిబ్బంది షాపులను తనిఖీలు చేసి మొదటి తప్పు కింద 500 రూపాయలు అపరాధ రుసుం విధించారు. వ్యాపారులు కూడా జాగ్రత్తలు పాటిస్తూ క్లాత్ బ్యాగ్‌లు వాడటం మొదలెట్టారు. ఇంతవరకు బాగానే ఉంది. అధికారులు పూర్తిస్థాయిలో దృష్టి పెట్టక పోవడంతో మళ్ళీ కథ మొదటికి వచ్చింది. మళ్ళీ ఇష్టానుసారంగా ప్లాస్టిక్ కవర్‌లు, గ్లాస్‌లు వాడటం మొదలెట్టారు. ఒకరిని చూసి మరొకరు అన్నట్లు ఇప్పుడు అందరూ ప్లాస్టిక్ వాడిస్తున్నారు. పర్యాటక ప్రాంతంలో ప్లాస్టిక్ వ్యర్థాలు పెరిగి పోతుండటంతో ప్లాస్టిక్‌ని నిషేధించడం ఒక్కటే మార్గమని కలెక్టర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శిని విశాలాంధ్ర వివరణ కోరగా ప్లాస్టిక్ వినియోగించే వారిపై చర్యలు చేపడుతున్నామని ఇప్పటికే 10 వేల రూపాయలు వరకు అపరాద రుసుం విధించినట్లు తెలిపారు.

వినతులను త్వరితగతిన పరిష్కరించాలి: కలెక్టర్

విశాలాంధ్ర – పార్వతీపురం: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా వచ్చిన రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. అర్జీల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యతను ఇవ్వాలని, అందుకు తగిన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. వాస్తవ పరిస్థితులను తెలుసుకొని, క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. సమస్యను బట్టి 24 గం.ల నుంచి 48 గం.ల్లోగా పరిష్కారం కావాలని సూచించారు. సమస్య పరిష్కారంతో అర్జీదారుడు సంతృప్తి చెందాలని, పరిష్కారం కాని సమస్య ఉంటే అందుకు గల కారణాలను సవివరంగా పూర్తి సమాచారంతో అర్జీదారుకు తెలియజేయాలని అన్నారు. సోమవారం ఉదయం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి కె.హేమలత, కె.ఆర్.ఆర్.సి ప్రత్యేక ఉప కలెక్టర్ డా. పి.ధర్మచంద్రారెడ్డి, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్ట్ అధికారి ఎం.సుధారాణితో కలసి కలెక్టర్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుండి విజ్ఞప్తులను స్వీకరించారు. అర్జీలను సంబంధిత అధికారులకు పంపి, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా రెవెన్యూ సమస్యలపై ఎక్కువ వినతులు రాగా, రీసర్వే, భూ వివాదాలు, ఉపాధి అవకాశాలు, పౌర సరఫరాల సేవలు, గృహ పట్టాలు, గృహాల మంజూరు, పింఛన్లు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రణాళిక అధికారి పి.వీర్రాజు, జిల్లా వ్యవసాయ, ఉద్యానవన, పశు సంవర్ధక శాఖల అధికారులు కె.రాబర్ట్ పాల్,బి.శ్యామల, డా.ఎస్.మన్మధరావు, డిఎంహెచ్ఒ డా. ఎస్.భాస్కరరావు, జిల్లా పంచాయతీ అధికారి టి.కొండల రావు, జిల్లా పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా ఇంజినీరింగ్ అధికారులు బి.చంద్రశేఖర్, ఓ.ప్రభాకర రావు, మునిసిపల్ కమిషనర్ సీహెచ్.వెంకటేశ్వర్లు, ఏపీఈ పిడిసిఎల్ పర్యవేక్షక ఇంజినీర్ కె.చలపతిరావు, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఆర్.కృష్ణవేణి, డీఎల్డీఒ రమేష్ రామన్, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను చట్టపరిధిలో పరిష్కరించాలి

జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి

విశాలాంధ్ర – పార్వతీపురం: జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించి, అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, తల్లిదండ్రులు వేధింపులు, భర్త/అత్తారింటి వేధింపులు, భూ-ఆస్థి వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు, ఆన్లైన్ మోసం, ప్రేమ పేరుతో మోసం, ఇతర సమస్యలపై ఫిర్యాదుదారులు స్వేచ్ఛగా విన్నవించుకోగా, వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్లో మాట్లాడి ఫిర్యాదు అంశాలను పరిశీలించి, వాటి పూర్వాపరాలను విచారణ చేసి, ఫిర్యాదు అంశాలు వాస్తవాలైనట్లయితే చట్ట పరిధిలో తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు కార్యాలయానికి పంపవలెనని అధికారులను ఆదేశించారు.పది ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్బీ సిఐ ఆదాం, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు

విశాలాంధ్ర – పార్వతీపురం: పార్వతీపురం మన్యంజిల్లా కేంద్రంలో కొత్తవలసలో ఉన్న శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాణ్యమైన విద్యను అందించడం జరుగు తుందని, ఇంటర్ ఉత్తీర్ణత చెందిన విద్యార్థులు తమ కళాశాలలో డిగ్రీ అడ్మిషన్లకు సంప్రదించాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతల చలపతిరావు తెలిపారు. కళాశాలలో క్రమశిక్షణతోపాటు నాణ్యమైన విద్యను, ఉత్తమ ఫలితాలు సాధన, ఉత్తమ బోధన అందించే దిశగా ప్రత్యేక శ్రద్ధతో బోధన చేయడం జరుగుతుందన్నారు. కళాశాలలో విశాలమైన మైదానం, విశాలమైన లైబ్రరీ, ఆధునాతన బోధనా సామాగ్రి, పూర్తిస్థాయి సైన్స్ లాబరేటరీ, పూర్తిస్థాయి బోధన సిబ్బంది, ఇటీవల నాక్ గుర్తింపు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి కళాశాలలో బీఎస్సీ, బిఎ, బి.కాం కోర్సులలో విద్యార్థులు జాయిన్ కావాలని తెలిపారు. కళాశాలలో ఎన్‌సిసి కూడా ప్రత్యేకతని తెలిపారు. వెనుక బడిన విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దడమే తమ కళాశాల ప్రత్యేకత అన్నారు. విద్యార్థులను పోటీ పరీక్షలకు దీటుగా తయారు చేయడంలో కూడా తమ సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకుంటు న్నారన్నారు. అన్ని రంగాలలో శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల ముందంజలో ఉంటుందన్నారు.

మలేరియా అధికారిని జిల్లాకు రప్పించాలి

విశాలాంధ్ర – బెలగాం: జిల్లా మలేరియా అధికారిని పార్వతీపురం మన్యం జిల్లాకు రప్పించాలని కోరుతూ పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పిజిఆర్ఎస్ గ్రీవెన్స్‌లో భాగంగా ఆదివాసి జెఎసి జాయింట్ సెక్రటరీ దుక్క సీతారాం జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రజా ఆరోగ్య రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ జిల్లా మలేరియా అధికారులను సంబంధిత ఐటిడిఎకు బదిలీ చేస్తూ ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వారు మెరుగైన సేవల సౌలభ్యం అందుబాటులో ఉండు నిమిత్తం జిల్లా మలేరియా అధికారులు హెడ్ క్వార్టర్స్‌కు బదిలీ చేస్తూ సంబంధిత ఐటిడిఎ ప్రాజెక్టు అధికారులకు అటాచ్మెంట్ చేస్తూ ఆయా జిల్లా మెడికల్, హెల్త్ ఆఫీసర్ అడిషనల్, డిఎంహెచ్ఓ, ఏజెన్సీ ఏరియాలోని అధికారులందరికీ జిల్లా కలెక్టర్‌కు, పిఓకు రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీ చేసి ఉన్నారని తెలిపారు. కానీ ఆదేశాలు ఒక సంవత్సరం దాటిపోయిన ప్పటికీ పార్వతీపురం మన్యం జిల్లా మలేరియా అధికారి విజయనగరంలో ఉంటున్నారని కాబట్టి రానున్న సీజన్ వర్షాకాలం, ట్రైబల్ ఏరియాలో విపరీతంగా మలేరియా టైఫాయిడ్ కలరా మొదలుకొని సీజనల్ జ్వరాలు ఎక్కువగా ఉంటాయి కాబట్టి వెంటనే పార్వతీపురంలో మలేరియా ఆఫీసును ఏర్పాటు చేసి సంబంధిత అధికారిని వెంటనే నియమించాలని కోరారు. దీని కారణంగా దిగువ స్థాయి సిబ్బంది పని పర్యవేక్షణ గ్రామ స్థాయిలో తనిఖీ చేయని పక్షంలో సమస్యలు కుంటుపడతాయని తెలిపారు. అలాగే వివిధ క్షేత్రస్థాయి పర్యటనలు అనివార్యమని దిగువ స్థాయి సిబ్బంది చేసే లోపభూయిష్ట సర్వే సరిదిద్దుటకు అందుకు తగిన ఏర్పాట్లు చేసుకొనుటకు పిఓ అందుబాటులో ఉన్నట్లయితే రాబోవు సమస్యలను అధిగమించవచ్చన్నారు.

ఏఎస్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ముఖాముఖి

విశాలాంధ్ర – వి.ఆర్.పురం: మండల కేంద్రం రేఖపల్లి గ్రామంలోని ఏఎస్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం మండల లెవెల్ ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏఎస్‌డీఎస్ సంస్థ అధినేత గాంధీ బాబు మాట్లాడుతూ 9 గ్రామ పంచాయతీల్లో గ్రామాలలో ఉన్న సమస్యలను అధికారులకు దరఖాస్తు రూపంలో ఇచ్చినా ఇప్పటి వరకు పరిష్కారం కాకుండా ఉన్న సమస్యలను మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకువెళ్లడం జరుగుతుందన్నారు. తదుపరి కమ్యూనిటీ గ్రామాలలో ఉన్న పరిష్కారం కాని సమస్యలను ఆర్ ఓ ఎఫ్ ఆర్, భూమి విభజన, ఆర్ అండ్ ఆర్ సమస్యలు, తాగు నీటి సమస్యలు, రోడ్డు సమస్యలు, ఐసిడిఎస్‌కి సంబందించిన వంటి సమస్యలు అధికారులకు ధరఖాస్తుల రూపంలో అందించడం జరిగింది. మండల తహశీల్దార్ వై.సరస్వతి మాట్లాడుతూ గ్రామ సభలో స్వచ్ఛంద సంస్థ ద్వారా ఇచ్చిన భూమికి సంబంధించిన ధరఖాస్తులు ఆర్ ఓ ఎఫ్ ఆర్ వెబ్ ల్యాండ్‌కి సంబంధించి అప్లికేషన్స్ ఇవ్వారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.రామాంజనేయ ప్రసాద్, రేఖపల్లి వెలుగు ఏపిఎం దుర్గా ప్రసాద్, సిడిపిఓ నాగలక్ష్మి, శ్రీకాంత్ రెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో, సెక్రటరీలు, సర్పంచులు, యూత్ లీడర్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

విశాలాంధ్ర – బెలగాం : ఫహల్గాం ఉగ్రదాడిని ఖండిస్తూ దాడికి వ్యతిరేకంగా పార్వతీపురం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పార్వతీపురం క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసి కాంప్లెక్స్ కూడలి వద్ద మానవహారం నిర్వహించి పీడిత కుటుంబాలకు అండగా ఉండి తీవ్ర సంతాపం ప్రకటించారు. పార్వతీపురానికి పట్టణ అనుబంధ వ్యక్తి చంద్రమౌళికి నివాళులర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురం లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు బి.ఎన్.బి రావు, వసుమర్తి వెంకటప్రసాద్ (బుజ్జి), కోశాధికారి బివిఎస్ నాయుడు అధిక సంఖ్యలో లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

మన మిత్ర యాప్ కరపత్రాల ఆవిష్కరణ

విశాలాంధ్ర – రంపచోడవరం: అల్లూరి జిల్లా అన్ని మండలాల్లోను అన్ని సచివాలయాల ద్వారా మనమిత్ర యాప్ ద్వారా 250 పైగా సేవలు ఏజెన్సీ ప్రాంత ప్రజలు పొందవచ్చని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఐటీడీఏ సమావేశపు హాల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ప్రజల చేతిలో మన ప్రభుత్వం మన మిత్ర యాప్ కరపత్రాలు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం, రంపచోడవరం సబ్ కలెక్టర్ కేఆర్ కల్పశ్రీ, ఏపీఓ జనరల్ డిఎన్వి రమణ, రంప చోడవరం గిరిజన సంక్షేమ శాఖ అధికారి రుక్మాండయ్య, డిఎల్‌డిఓ కే.కోటేశ్వరరావు, గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ.శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రంపచోడవరం ఐటీడీఏ అధికారి కట్ట సింహాచలం మాట్లాడుతూ ఏజెన్సీ ఏడు మండలాల్లో ప్రతి గ్రామ పంచాయతీ సచివాలయాలలో మన చేతిలో మన ప్రభుత్వం అదేవిధంగా మనమిత్ర వాట్సాప్ ద్వారా వివిధ రకాలైన 250 సేవలు మీకు కావాల్సిన వాటిని ఎంపిక చేసుకునే విధంగా ఈ వాట్సాప్ ఎంతగానో ఉపయోగ పడుతుందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మనమిత్ర (వాట్సాప్ గవర్నెన్స్) 955230009కు హాయ్ అని టైప్ చేసి హాయిగా సేవలు పొందవచ్చన్నారు. రంపచోడవరం సబ్ కలెక్టర్ కెఆర్ కల్పశ్రీ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. మహిళలకు, చిన్నారుల భద్రతకు శక్తి యాప్ ఉపయోగించుకోవాలని ఆమె అన్నారు. ఎక్కడైనా మీకు అనుమానం వచ్చిన వెంటనే సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1930కు సంప్రదించగలరని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్ గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ.శ్రీనివాసరావు, తహశీల్దార్ పి.రామకృష్ణ, ఎంపీడీవో ఎస్. శ్రీనివాసరావు దొర, ఉపాధి హామీ పథకం ఏపీడీ జి.శ్రీనివాసరావు, జిసిడిఎం పార్వతీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ముత్యాలమ్మ అమ్మవారి అనుపోత్సవం
నిఘా నేత్రంలో ప్రశాంతంగా ముగిసిన జాతర

విశాలాంధ్ర – చింతపల్లి: మన్య ప్రాంత ఆరాధ్య దైవం చింతపల్లి గ్రామ దేవత శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి అనుపోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఉత్సవం నాలుగో రోజయిన ఆదివారం వివిధ వేష ధారణలతో కూడిన శక్తి వేషాలు, కోలాటాలు సాంప్రదాయ నృత్యాలతో చింతపల్లి నూతన శోభను సంతరించుకుంది. స్థానిక సాడిపేట వీధిలోని సుర్ల వంశస్తుల గృహం నుంచి పూజారి సుర్ల అప్పారావు అమ్మవారి పాదుకలు, గరగలు ఘటాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంధమావాస్యను పురస్కరించుకుని ఆదివారం ఉదయం నుంచే ముత్యాలమ్మ ఆలయం వద్దకు భక్తులు క్యూ కట్టారు. కట్టుదిట్టమైన భద్రత కల్పించడంలో స్థానిక ఏఎస్పి నవ జ్యోతి మిశ్రా ఆదేశాల మేరకు స్థానిక సర్కిల్ ఇన్స్పెక్టర్ వినోద్ బాబు, సబ్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వరరావు వెంకట రమణలు ఉత్సవానికి 15 రోజుల ముందు నుంచే తీసుకున్న చర్యలు ఫలించాయి. అనుపోత్సవ కార్యక్రమంలో భాగంగా సుర్లవారి స్థావరంలో అమ్మవారి పాదుకలు, గరగలకు ముత్యాలమ్మ పాదాలకు పూజారి సుర్ల అప్పారావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్యాలమ్మ అమ్మవారి పాదుకలను పాడేరు మాజీ శాసనసభ్యురాలు, తెదేపా పాడేరు నియోజక వర్గ ఇన్చార్జి, గిడ్డి ఈశ్వరి, స్థానిక ఎంపీపీ కోరాబు అనూష దేవి, ఎంపీటీసీ సభ్యురాలు దాసరి ధారలక్ష్మి లతో పాటు భక్తులు శిరస్సుపై ఎత్తుకుని పోలీసులు ఏర్పాటుచేసిన పటిష్ట భద్రత నడుమ భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెదేపా సీనియర్ నాయకురాలు బొర్రా విజయ రాణి, సభ్యుడు పోతురాజు బాలయ్య, స్థానిక పంచాయతీ సర్పంచ్ దురియా పుష్పలత, ముత్యాలమ్మ ఉత్సవ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దురియా హేమంత్, పసుపులేటి వినాయకరావు. ఆర్గనైజింగ్ కార్యదర్శి పెదిరెడ్ల బేతాళుడు, సుర్ల వంశీయులు తిరుపతిరావు. వీరేంద్ర కుమార్ పాల్గొన్నారు.

క్యాంపు కోర్టు సివిల్ జడ్జికి చిరు సత్కారం

విశాలాంధ్ర – సీతంపేట: ఐటీడీఏలో సోమవారం క్యాంపు కోర్ట్ సివిల్ జడ్జ్ అగ్గాల విజయ రాజ్ కుమార్ గజపతి నగరం కోర్టుకు బదిలీ అవుతున్న సందర్భంగా పాలకొండ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం.శామ్యూల్ ఆధ్వర్యంలో లాయర్ల బృందం జడ్జికి చిరు సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో సతీష్, ఆర్కె.స్వామి, కృష్ణారావు, రవి, నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన తరగతులు ప్రారంభం

విశాలాంధ్ర – కూనవరం: కూనవరం శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు ప్రారంభమయ్యాయి. సోమవారం నుంచి జూన్ 6వ తేదీ వరకు ఈ తరగతులు కొనసాగుతాయని గ్రంథాలయ పాలకులు ఎం.గోవిందరాజులు తెలిపారు. పాఠశాల విద్యార్థులకు వేసవి సెలవులు కావడంతో గ్రంథాలయంలో పిల్లలు ఎక్కువ సమయం గడపడం వల్ల ఎన్నో కొత్త విషయాలు నేర్చుకోవచ్చని సృజనాత్మక పెరుగుతుందని ఆయన అన్నారు. పిల్లలకు ఎంతో ఇష్టమైన కథల ద్వారా కొత్త కొత్త సైన్స్ విషయాలు, సృజనాత్మకతను పెంపొందించే ఎన్నో పుస్తకాలు అందుబాటులో ఉంటాయని, తల్లిదండ్రులు పిల్లలను గ్రంథాలయానికి పంపడం పుస్తకాలు చదివించేలా శ్రద్ధ తీసుకోవడం వలన పిల్లలకు ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయని అన్నారు. వేసవి సెలవులు కావడంతో పిల్లలు ఇంట్లో సెల్ ఫోన్లు టీవీలు ద్వారా గడపడం, వాగులు నదులు వంటి ప్రమాదకరమైన స్థలాల్లో ఆటలాడటం వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాటిని నిరోధించేలా తల్లిదండ్రులు బాధ్యత తీసుకొని పిల్లలను గ్రంథాలయానికి పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు వహీద్, వెంకటస్వామి, పిలక ప్రసాద్, గడ్డిపాటి ప్రసాద్ యాలం గౌతం, చెరుకూరి సుబ్బారావు, కృష్ణార్జునరావు, పిల్లలు పాల్గొన్నారు.

పేదల చెంతకు ఉచితంగా ఖరీదైన వైద్యం
గుండెపోటుతో వచ్చిన వ్యక్తిని కాపాడిన వైద్యులు

విశాలాంధ్ర – కూనవరం: ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉంచిన నలభై వేల రూపాయల గుండెకు సంబందించిన టెనెక్టో ప్లస్ ఇంజక్షన్ వలన వైద్యులు ఒక నిరుపేద వ్యక్తి ప్రాణాలను కాపాడడం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. వరరామచంద్రాపురం మండలం శ్రీరామగిరికి గ్రామానికి చెందిన ముత్యాల వెంకట నారాయణ శనివారం అస్వస్థత కు గురి కావడంతో కూనవరంలోని కోతులగుట్ట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కు రావడం జరిగింది. ఆసుపత్రికి వచ్చిన సమయంలో ఛాతిలో నొప్పి, వొళ్ళంతా చెమటలు పడుతుండడంతో వైద్య సిబ్బంది వెంటనే ఆయనకు ఈ సీ జీ పరీక్షలు చేయడం జరిగింది. ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. కె. మహేష్ బాబు, డ్యూటీ వైద్యాధికారి డా. సీ.తేజలు వెంకట నారాయణకు గుండె నొప్పిగా గుర్తించారు. దీంతో వెంటనే ఆసుపత్రి లో అందుబాటులో ఉంచిన రూ.టెనెక్టో ప్లస్ ఇంజక్షన్ ఇవ్వడంతో ఆ వ్యక్తి కి ప్రాణాప్రాయం తప్పిందని సూపరింటెండెంట్ డా. కె మహేష్ బాబు తెలిపారు. పేషెంట్ సరైన సమయానికి కోతులగుట్ట ఆసుపత్రికి రావడం వెంటనే ఈ ఇంజక్షన్ ఇవ్వడం తో ప్రాణాలు కాపాడమని తెలిపారు. ప్రస్తుతం ముత్యాల వెంకట నారాయణ ను కుటుంబ సభ్యులు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రాజమండ్రి కి తీసుకువెళ్లడం జరిగిందని తెలిపారు. తన తండ్రి ప్రాణాలు కాపాడం పట్ల కుటుంబ సభ్యులు డాక్టర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

పచ్చని చెట్లను కాల్చేస్తున్నారు

విశాలాంధ్ర – జియ్యమ్మవలస: పెదమేరంగి నుండి జియ్యమ్మవలస వరకు గల ఆర్ అండ్ బి రహదారికిరువైపులా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టి బాటసారులకు నీడనందించి పచ్చని వాతావరణం కల్పిస్తుంటే మరోపక్క రైతులు వాటికి నిప్పంటించి కాల్చేయడం చాలా దారుణమని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏటా ఆర్ అండ్ బి రోడ్డుపై రైతులు తమ వరి చేలు నూచేను వేసి పంట చేతికి వచ్చాక వరి గడ్డినూ కంకిని జొన్న కంకి కాల్చడంతో రహదారి పక్కన ఉన్న పచ్చని చెట్లకు నిప్పంటుకొని పూర్తిగా దహనమైపోతున్నాయి. ఇది ఇలా ఉండగా పెద బుడ్డిడి నుండి చిన బుడ్డిడి మధ్య ఉన్న ఇటిక గెడ్డ, నాగావళి వంతెన ప్రక్కనే జొన్న మినుము వరి నువ్వు వ్యర్థాలను వేసి కాలుస్తుంటే ఆ మంటల దాటికి వంతెన పునాదులు బీటలు వారే ప్రమాదముందని తెలిసినప్పటి రైతులు యదేచ్చగా కాలుస్తూనే ఉన్నారు. దీనిపై కూడా అధికారులు చర్యలు తీసుకునే పరిస్థితి లేక పోతుంది. ఇది ప్రతిఏటా ప్రక్రియగా జరుగుతున్న అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి వీటిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సకాలంలో సమస్యలు పరిష్కారం: పీఓ

విశాలాంధ్ర – రంపచోడవరం: గ్రీవెన్స్‌లో వచ్చిన వినతులను సకాలంలో పరిష్కరిస్తామని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఐటిడిఎ సమావేశపు హాలులో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమం రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం, రంపచోడవరం సబ్ కలెక్టర్ కెఆర్.కల్పశ్రీ, ఐటీడీఏ ఏపీవో జనరల్ డిఎన్వి రమణ నిర్వహించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ ఈవారం 50 దరఖాస్తులు రావడం జరిగిందని తెలిపారు. వివిధ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు పూర్తిస్థాయిలో పరిశీలించి దరఖాస్తు దారుల అర్హతలను బట్టి సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గంగవరం మండలం మోనాపురం పంచాయతీ పరిధిలో లక్ష్మీపురం గ్రామానికి చెందిన సుమారు 60 మంది గిరిజనులకు ఒక వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేయాలని, మినీ అంగన్వాడి కేంద్రం ఏర్పాటు చేయాలని అదేవిధంగా 25 మంది పిల్లలకు ఒక స్కూలు ఏర్పాటు చేయాలని వినతి అందజేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ యం. రుక్మాండయ్య, రంపచోడవరం పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, ఏజెన్సీ డీఈవో వై.మల్లేశ్వరరావు, ఉపాధి హామీ పథకం. ఏపీడి జి.శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఐ.శ్రీనివాసరావు, రవికుమార్, జీసిసి డివిజనల్ మేనేజర్ జి.పార్వతీశ్వరరావు, డిఎల్‌డిఓ కోటేశ్వరరావు, డాక్టర్ రతన్, తహశీల్దార్ పి.రామకృష్ణ, ఎంపీడీవో యస్.శ్రీనివాసరావు దొర, ఈవోపిఆర్డి పద్మ, సిడిపిఓ సంధ్యారాణి, పిఏఓ ఎల్.రాంబాబు, ఏడిఏ సిహెచ్ కెవి చౌదరి, వెలుగు ఎపిడి డేగలయ్య, ఏయంఓ విజయభాస్కర్, డిప్యూటీ తాసిల్దారు త్రిమూర్తులు, శ్రీధర్, వి.రవీంద్ర, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, పి.వెంక టరమణ, సాయి సతీష్, సుబ్బారావు, మల్లికార్జునరావు, డిప్యూటీ సర్వే ఆఫ్ ఇన్స్పెక్టర్ లక్ష్మణ్, పిఏఓ ఎల్.రాంబాబు, డిడి ఆఫీస్ సూపరెండెంట్ బి.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

మినీ అంగన్వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

విశాలాంధ్ర - సీతంపేట: ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో గల 2 మినీ అంగన్వాడీ కార్యకర్తల పోస్టు లకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సోమవారం ఐటీడీఏ పీవో సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ఇంటర్వ్యూలు నిర్వహించారు. సీతంపేట మండలం లోని వెంపలగూడ, రాజు గారి గూడ మినీ అంగ న్వాడీ కేంద్రాలలో రెండు కార్యకర్త పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. దీనిలో భాగంగా వెంపలగూడ కేంద్రానికి దరఖాస్తు చేసుకున్న ముగ్గురు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. రాజుగారి గూడ కేంద్రానికి ఒక్క దరఖాస్తు కూడా రాకపోవడంతో దానికి ఇంటర్వ్యూ నిర్వహించలేదు. ఎంపికైన అభ్యర్థులకు తర్వాత సమాచారం అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎం హెచ్‌వో విజయపార్వతి, సీడీపీఓలు రంగలక్ష్మి, సూపర్ వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో చెరువుల పరిరక్షణకు చర్యలు: కలెక్టర్

విశాలాంధ్ర - పార్వతీపురం: జిల్లాలోని చెరువులు ఆక్రమణకు గురికాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని, వాటిని పరిరక్షించవలసిన బాధ్యత అధికారులపై ఉందని జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పథకం ద్వారా చెరువులను అభివృద్ధి చేసే కార్యక్రమాన్ని చేపట్టబోతున్నామని, కావున రెవిన్యూ, పోలీస్, సర్వే అధికారులు సంయుక్తంగా చెరువులను, వాటి సరిహద్దులను గుర్తించాలని స్పష్టం చేశారు. చెరువులు ఆక్రమణ గురైనట్లు గుర్తిస్తే వాటి వివరాలను పంచాయతీ అధికారికి తెలియజేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వివరించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం జిల్లా అధికారులతో పలు అంశాలపై కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు సేవలో భాగంగా ఎన్.టి.ఆర్ భరోసా పింఛన్లను మే 1వ తేదీ ఉదయం శత శాతం పంపిణీ చేసేలా మండల ప్రత్యేక అధికారులు చొరవ చూపాలన్నారు. ఉపాధి హామీలో చెక్ డ్యాములను నిర్మిస్తున్నామని, చెరువులను చెక్ డ్యాము లకు అనుసంధానించడం ద్వారా నీటి వనరులు అందుబాటులో ఉంటాయని అన్నారు. చెరువులు, చెక్ డ్యాములకు సంబందించిన పనులు ఈ రోజు నుంచే ప్రారంభం కావాలని కలెక్టర్ తెలిపారు. ఉపాధి హామీలో నీటికుంటలకు అధికారులు అత్యధిక ప్రాధాన్యతను ఇవ్వాలని అన్నారు. జిల్లాలో వీలైనన్ని నీటికుంటలను నిర్మించేందుకు సిద్ధంగా ఉన్నామని, వాటిని ఏర్పాటుచేసేందుకు ఇది తగిన సమయమైనందున అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఉపాధి హామీ శ్రామికులకు బీమా వర్తించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, పిఎం కుసుం కొరకు ప్రభుత్వ స్థలాలను గుర్తించాలని కలెక్టర్ వివరించారు. అనీమియా యాక్షన్ కమిటీలకు రిజిష్టర్లను పంపిణీ చేయడం జరిగిందని, మహిళా పోలీసు అందరినీ సమన్వయపరచి కమిటీలు ఏర్పాటు చేసి, కమిటీలో తీసుకున్న నిర్ణయాలను రిజిష్టర్ నందు నమోదు చేయాలని పేర్కొన్నారు. అనీమియా యాక్షన్ కమిటీలు నిర్వహించే తేదీలను ముందుగా గ్రామస్తులకు తెలియ జేయాలని అన్నారు. జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య ఉండటానికి వీల్లేదని కలెక్టర్ తేల్చిచెప్పారు. నీటి సరఫరాకు అంతరాయం లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని, మరమ్మతులు ఉన్నచోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అన్నారు. అలాగే జిల్లాలో అసంపూర్తిగా ఉన్నటువంటి ప్రభుత్వ భవన నిర్మాణాలన్నింటిని పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మండల పరిషత్ నిధులు, పంచాయతీ నిధులు లేనిచోట నిధులను కూడా సమకూర్చేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. కౌలు రైతులకు ఇచ్చే సీసీఆర్సీ కార్డులపై అవగాహన కల్పించి, వాటిని మంజూరుచేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా ప్రణాళిక అధికారి పి.వీర్రాజు, జిల్లా వ్యవసాయ, ఉద్యానవన, పశు సంవర్ధక శాఖల అధికారులు కె.రాబర్ట్ పాల్, బి.శ్యామల, డా.ఎస్.మన్మథరావు, డిఎంహెచ్ఓ డా. ఎస్.భాస్కరరావు, జిల్లా పంచాయతీ అధికారి టి.కొండల రావు, జిల్లా పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా ఇంజినీరింగ్ అధికారులు బి.చంద్రశేఖర్, ఓ.ప్రభాకరరావు, మునిసిపల్ కమిషనర్ సీహెచ్.వెంకటేశ్వర్లు, ఏపీఈపిడిసిఎల్ పర్యవేక్షక ఇంజినీర్ కె.చలపతిరావు, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఆర్.కృష్ణవేణి, డీఎల్డీఓ రమేష్ రామన్, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రహదారులపై పశువుల సంచారం కథనానికి "స్పందన"

విశాలాంధ్ర - చింతపల్లి: రహదారులపై పశువుల సంచారంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్న విశాలాంధ్ర కథనానికి విశేష స్పందన వచ్చింది. సోమవారం విశాలాంధ్ర దినపత్రికలో వచ్చిన ఈ కథనానికి పశుసంవర్ధక శాఖ ఏడి చంద్రశేఖర రావు స్పందించారు. పశువులను విచ్చలవిడిగా విడిచిపెట్టకుండా సంరక్షించుకోవాలని గతంలోనూ పశువుల యజమానులకు సూచించడం జరిగిందన్నారు. పశువులను విచ్చలవిడిగా విడిచిపెడితే గో శాలలకు తరలించడం జరుగుతుందని పలుమార్లు నోటీసులు అందజేయడం జరిగిందన్నారు. అయినప్పటికీ కొంతమంది పశు యజమానులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వలన సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయన్నారు. పర్యావరణ పరిరక్షణకు, వ్యవసాయం, పాడిపంటల నిమిత్తం పశు సంపదను కాపాడుకోవలసిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అటువంటి పశు సంపదపై యజమానులు ప్రత్యేక శ్రద్ధ వహించకపోవడం దురదృష్టం అన్నారు. పశువులు ప్రధాన రహదారులపై ఉండడం వలన ప్రమాదాలు సంభవిస్తున్నాయనటం వాస్తవమన్నారు. ఇటువంటి సంఘటనల వలన అటు పశువులు, ఇటు వాహనదారులు ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు ఏర్పడడం బాధాకరం అన్నారు. మరో మారు పశు యజమానులకు నోటీసులు అందజేసి తదుపరి శాఖ పరంగా చర్యలు చేపట్టి, యజమానుల సంరక్షణలో లేని విచ్చలవిడిగా తిరిగే పశువులను గో శాలలకు తరలించే ప్రక్రియకు చర్యలు చేపడతామని, ఈ విషయాన్ని ప్రతి పశు యజమాని గుర్తించి తమ తమ పశువులను రాత్రిపూట కచ్చితంగా సంరక్షించు కోవాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.

గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల గొప్పతనం భావితరాలకు తెలియాలి

ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ శంకర్రావు

విశాలాంధ్ర - చింతపల్లి: ఆంధ్ర కశ్మీర్ లంబసింగి, తాజంగి ప్రాంతంలో నిర్మితమవుతున్న గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం ఆవశ్యకత, ఉద్దేశాలు గొప్పతనం భావితరాలకు తెలియ జెప్పేందుకు మ్యూజియం నిర్మాణం ఎంతగానో ఉపయోగ పడనుందని ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకర్రావు అన్నారు. చింతపల్లి ఏజెన్సీలో జిల్లా జాయింట్ కలెక్టర్,పాడేరు ప్రాజెక్ట్ అధికారి అభిషేక్ గౌడ్, పాడేరు సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్ లతో కలసి సోమవారం ఆయన పర్యటించారు. అనంతరం లంబసింగి, తాజంగి గ్రామాల మధ్య నిర్మాణంలో ఉన్న గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం పనులను పరిశీలించారు. ఆ పనులపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతం భారతదేశంలో ఒక మంచి స్థానం సంపాదించుకోవాలన్న సదుద్దేశంతోనే ఇటువంటి నిర్మాణాలకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. ఆ ఉద్దేశంతో ఈ పనులన్నీ ఎలా ఉన్నాయి. ఏ స్థాయిలో ఉన్నాయి.ఇంకా ఎంత శాతం పనులు పూర్తి కావాలనే విషయాలు తెలుసుకోవడం కోసం ఇక్కడకు రావడం జరిగిందన్నారు. ఈ క్రమంలో మ్యూజియంలో సందర్శించడం, పరిశీలించడం జరిగిందన్నారు. ఈ ప్రాజెక్టు చాలా మంచిదని, చరిత్రను తెలియజెప్పేదిగా ప్రాజెక్టు ఉంటుందన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం పనులు త్వరితగతిన పూర్తి కావలసిన అవసరం ఉందన్నారు. అనుకోకుండా సంభవించిన అవాంతరాల కారణంగా పనులలో జాప్యం ఏర్పడిందన్నారు. ముఖ్యంగా నిధుల సమస్య లేదన్నారు. అనుకోని అవాంతరాలేర్పడి పనులలో జాప్యం జరగడం వాస్తవమన్నారు. దీనికి గల కారణం కాంట్రాక్టర్లు పనులను మధ్యలో నిలుపుదల చేసి వెళ్లిపోవడం వలన జాప్యం ఏర్పడిందన్నారు. ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించి, చర్యలు చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వం మ్యూజియం పనులు వేగవంతంగా జరిగేందుకు కొత్తవారిని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. త్వరలోనే ఈ పనులు ప్రారంభం కానున్నాయన్నారు. ప్రస్తుతం నిధుల సమస్య ఏమీ లేదన్నారు. ఆదివాసీల నాగరికతకు, ఆధునికతకు దూరంగా ఉన్నారేమో కానీ సమాజానికి మాత్రం ఎప్పుడూ దగ్గరగానే ఉన్నారన్నారు. భారతదేశానికి కావాల్సినన్ని సేవలందించారన్నారు. అదేవిధంగా స్వాతంత్ర పోరాటంలో కూడా చాలామంది గిరిజనులు భాగస్వాములై అశువులు బాశారన్నారు. వాళ్ల చరిత్ర గురించి మెయిన్ స్ట్రీమ్ మీడియాలో కానీ మిగతా ప్రపంచానికి గానీ తెలియదన్నారు. ఆ మహనీయుల గొప్ప తనమును, త్యాగనిరతిని తెలియజేసే ఉద్దేశమే ఈ గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం లక్ష్యం అన్నారు. ఆదివాసి ప్రాంతాల్లో విప్లవ వీరుడు, అల్లూరి సీతారామరాజుతో పాటు ఎందరో గిరిజనులు బ్రిటీషర్లపై పోరాటం చేశారన్నారు. ఆ సమయం లో పెద్దలంతా చేసిన పోరాట ఫలితాలను ప్రజలకు తెలియచెప్పేందుకు మ్యూజియం దోహద పడుతుందన్నారు. ఇక్కడ గిరిజనుల కోసం అటవీ సంపద కోసం, ప్రకృతిని పరిరక్షించడం కోసం, ధ్యేయంగా ఉండటంతో పాటు ఆంగ్లేయులను బయటకి పంపించడంలో ఎందరో మహానుభావులు ప్రముఖ పాత్ర వహించారని, అటువంటి మహనీయుల చరిత్రను ప్రపంచానికి తెలిసేలా, వాళ్లని భావితరాలు కూడా గౌరవించు కునేలా ఈ మ్యూజియం తయారవ్వాలని తాను ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలు, భాష ప్రత్యేకమైన వైవిధ్యం గురించి కూడా ఈ మ్యూజియం సందర్శించే వారికి, బావి తరాలకు తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. చరిత్ర గొప్పతనం గురించి ప్రస్తుతం ఆదివాసి పిల్లలకి తెలియని పరిస్థితిలో ప్రస్తుతం మనమున్నామన్నారు. గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలు ఈ తరం పిల్లలకు తెలియదని, అది తెలియచెప్పేందుకే ఇటువంటి మ్యూజియం నిర్మాణాలు ఎంత గానో ఉపయోగపడతాయన్నారు. ఆ రకమైన ఉత్తమ ప్రమాణాలతో మ్యూజియం మెరుగులు దిద్దుకోవాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. అదేవిధంగా కమిషన్ తరపున కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం ఉన్నతాధికారులతో, ఇక్కడ సమస్యలపై మాట్లాడి, కమిషన్ తరపున చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల ఉన్నత అధికారులు, స్థానిక ఏ టి డబ్ల్యూ ఓ బలిరెడ్డి నాగ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌పై ఎంపీపీ ఫిర్యాదు

విశాలాంధ్ర - కురుపాం: కురుపాం తహశీల్దార్ ఎం.రవణమ్మపై ఎంపీపీ శెట్టి పద్మావతి సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్ శ్యాంప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో తహశీల్దార్ వల్ల రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని రైతులు సమస్యలు రెవెన్యూ ద్వారా సకాలంలో పరిష్కారం అవడం లేదని అంతేకాకుండా మ్యుటేషన్లకు రైతుల వద్ద నుండి అధిక మొత్తంలో వసూళ్లు చేస్తున్నారని అన్నారు. పంట నష్టపోయిన రైతులకు హార్టికల్చర్,

అధికారులు వీఆర్వోలు సంతకాలు చేసి నష్టపరిహారం అంచనా వేసినప్పటికీ తహశీల్దార్ మాత్రం సంతకం పెట్టకుండా రైతులను అనేకసార్లు తిప్పుతూ ఇబ్బంది పెడుతున్నారన్నారు. శనివారం జరిగిన సర్వసభ సమావేశంలో పలువురు సర్పంచులు సభ దృష్టికి తీసుకువచ్చి అధికారులు పెట్టిన సంతకాల మీద నమ్మకం లేకపోతే పంట నష్టపోయిన దగ్గరికి వెళ్లి పరిశీలించి సంతకాలు పెట్టాలి తప్ప రైతులను ఇబ్బంది పెట్టకూడదని సర్పంచులు అడిగినప్పటికీ తహశీల్దార్ నేనే సుప్రీం నేనే బాస్ తప్ప నేనెవరికి సబార్డినేట్ కాదని సమాధానం చెప్పిందని కావున ఆమెపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి రెవెన్యూ సేవలపై రైతులు ఎవరు ఇబ్బంది పడకుండా ఉండేలా చర్యలు చేపట్టాలని కోరడం జరిగిందని అన్నారు.

విజేతలకు బహుమతులు

పేద గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేసిన ఎస్పీ

విశాలాంధ్ర - కురుపాం: కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా మండలం లోని నీలకంఠాపురం పోలీసులు ఆధ్వర్యంలో గత 20 రోజులుగా నిర్వహిస్తున్న మెగా క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్లో నీలకంఠాపురం జట్టుపై కొండవాడ క్రికెట్ జట్టు ఘన విజయం సాధించింది.విన్నర్స్ గా నిలిచిన కొండవాడ జట్టుకు ఎస్పీ మాధవరెడ్డి.చేతులు మీదుగా సోమవారం ప్రైజ్ మనీ రూ పదివేల రూపాయలు, ట్రోఫీ, రన్నర్స్‌గా నిలిచిన నీలకంఠాపురం జట్టుకు 5000 ప్రైజ్ మనీ తో పాటు ట్రోఫీని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ ఫ్రెండ్లీ పోలీసింగ్ లో భాగంగా యువత చెడు మార్గంలో నడవకుండా ఉండేందుకు క్రికెట్, వాలీబాల్ టోర్నమెంట్‌లను పలు పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం వివిధ గ్రామాల 500మంది గిరిజన ప్రజలకు దుప్పట్లు, గొడుగులు, వాలిబల్ కిట్లు మన్యం జిల్లా ఎస్పీ మాధవ రెడ్డి పంపిణీ చేశారు. గిరిజన యువత చెడు వ్యసనాలకు, నక్సలిజంకు ప్రభావితం కాకుండా ముమ్మర చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకొండ డిఎస్పి రాంబాబు, సిఐ హరి, ఎస్ఐలు నీలకంఠరావు, నారాయణరావు తెలుగు యువత ప్రతినిధి కోలా రంజిత్ కుమార్, సర్పంచ్ ఎ.మన్మథ రావు, గౌరీశంకర్, వైస్ ఎంపీపీ అన్నాజీరావు, మాజీ ఎంపీపీ నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

పండగ నాలుగు రోజులు గ్రామమంతా విద్యుత్ వెలుగులు...

సోమవారం అంతా విద్యుత్ కోత

విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యం

విశాలాంధ్ర - చింతపల్లి :- మన్యప్రాంత ఆరాధ్య దైవం, చింతపల్లి గ్రామ దేవత శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ అమ్మవారి జాతర సందర్భంగా ఈనెల 24 నుంచి 27 వరకు నాలుగు రోజులు పాటు గ్రామమంతా రాత్రిపూట కూడా విద్యుత్ వెలుగులతో పట్టపగలుగా ఉన్నప్పటికీ, విద్యుత్తు వినియోగదారుల సౌకర్యార్థం విద్యుత్ సరఫరా చేయడంలో ఆ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా సోమవారం నాడు రోజంతా విద్యుత్ కోత విధించి వినియోగదారుల సహనానికి పరీక్ష పెట్టారు. వేసవి కాలం కావడంతో సోమవారం అధిక ఉష్ణోగ్రత నమోదు అయింది. దీంతో ప్రజలు విద్యుత్ లేక ఫ్యాన్లు తిరిగే పరిస్థితి లేకపోవడంతో ఒక్క పోతతో ఉక్కిరి బిక్కిరి అయ్యారు. దీంతో పండగ నాలుగు రోజులు రాత్రిపూట కూడా పట్టపగలు, పండగ పూర్తయిన మరుసటి రోజు విద్యుత్ కోతతో చిమ్మ చీకట్లతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

పదిలో ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ

గిరిజన సంక్షేమశాఖ ఉప సంచాలకులు ఆర్.కృష్ణవేణి

విశాలాంధ్ర - పార్వతీపురం: 2025 మార్చి నెలలో జరిగిన 10వ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేని గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు ఈనెల 28నుంచి పార్వతీపురంలో ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఆర్.కృష్ణవేణి తెలిపారు. సోమవారం ఆమె ఒక ప్రకటనను విడుదల చేశారు. కావున గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులందరూ తమ పరిధిలోని టెన్త్ ఫెయిలైన ఆశ్రమ పాఠశాల విద్యార్థినీ విద్యార్థులను తప్పకుండా స్పెషల్ కోచింగ్ సెంటర్లు, పార్వతీపురంకు తీసుకొని వచ్చి అడ్మిట్ చేయాలని ఆమె ఆదేశించారు. ప్రత్యేక శిక్షణ తరగతుల్లో భాగంగా విద్యార్థినీ విద్యార్థులకు వేర్వేరుగా కోచింగ్ మరియు వసతి సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు ఆమె చెప్పారు. బాలుర కొరకు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, పార్వతీపురం, బాలికలకు గిరిజన సంక్షేమ పోస్టుమెట్రిక్ వసతి గృహం (బాలికలు), పార్వతీపురం నందు కోచింగ్ మరియు వసతి కల్పించామని అన్నారు. కావున ఉత్తీర్ణత సాధించని విద్యార్థినీ విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె ఈ సందర్భంగా విద్యార్థులకు పిలుపునిచ్చారు.

ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: ఆంధ్ర వనవాసి కళ్యాణ్ ఆశ్రమ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం మండలం కేంద్రంలోని రామాలయం ఆలయ ప్రాంగణంలో సోమవారం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని మామిడి రాజు జ్యోతి ప్రజ్వాలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మామిడిరాజు మాట్లాడుతూ ప్రతినెల ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించి, ఉచితంగా మందులు కూడా పంపిణీ చేస్తారని ఆయన తెలియజేశారు. ఈ సందర్భంగా వైద్యుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ పక్షవాతం, గుండెపోటు, షుగర్, బీ.పీ, మందులు కూడా ప్రతి నెల ఉచితంగా అందిస్తారన్నారు. సుమారు 200 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. మండల కోఆర్డినేట్ ప్రసాద్ మాట్లాడుతూ ఎవరికైనా, మేజర్ సమస్యలు వస్తే ఉచితంగా వైద్యసేవలు అందించేందుకు సంస్థ సిద్ధంగా ఉందని, సంప్రదించాలని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ పెద్దలు, రోగులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు...

నగర పంచాయతీ కౌన్సిల్లో బలం మాదే...

నైతిక విజయం మాదే.....

ఏపీ ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

విశాలాంధ్ర - పాలకొండ: పాలకొండ నగర పంచాయతీ చైర్పర్సన్ ఎన్నికలలో సోమవారం కూటమి నాయకులు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని వైసీపీకి చెందిన ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి తీవ్రంగా విమర్శించారు. నిబంధనలు సాకుగా చూపి బలం లేకపోయినా కూటమి నాయకులు అధికార గర్వంతో చైర్మన్ తమ పార్టీకే చెందినవారు అంటూ బలం లేకపోయినా సంబరపడుతున్నారని విమర్శించారు. ఇది నైతికత కాదని ఎద్దేవ చేశారు. టిడిపికి చెందిన వ్యక్తి అయితే మల్లేశ్వరి ఇండిపెండెంట్‌గా ఎందుకు నామినేషన్ వేశారని ప్రశ్నించారు. టిడిపి తరఫున ఎందుకు చైర్మన్ అభ్యర్థిగా నామినేషన్ వేయించుకో లేకపోయారని ప్రశ్నించారు. మున్సిపల్ ఎన్నికలలో వైసిపి నుంచి రెండవ వార్డు సభ్యురాలిగా ఆకుల మల్లేశ్వరి ఫ్యాను గుర్తుపై గెలుపొందారని భయభ్రాంతులకు గురిచేసి ప్రలోభాలు చూపి ఇటీవల టిడిపిలోకి చేర్చుకున్నారని అన్నారు. ఆకుల మల్లేశ్వరి ఇప్పటికీ తమ పార్టీకి చెందిన వ్యక్తి అని చైర్పర్సన్ ఎన్నికలలోను వైసీపీకి కేటాయించిన సీట్లలోనే ఆమె కూర్చున్నారని స్పష్టం చేశారు. ఇది కూటమి నాయకులు తెలుసుకోవాలని అన్నారు. ఆమెను వైసిపి తరుపున చైర్పర్సన్‌గా ప్రకటిస్తూ బీఫారం అందజేశామని ఆమె వైసీపీ తరుపున చైర్మన్గా విజయం సాధించారని వీరు అభివర్ణించారు. చైర్పర్సన్ అభ్యర్థి తమ పార్టీ గెలిచినట్లు రాష్ట్రమంత్రి తో పాటు స్థానిక ఎమ్మెల్యే సంబరపడుతున్నారని కౌన్సిల్లో తమ పార్టీకి బలం ఎక్కువగా ఉంది అంటూ స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ విక్రాంత్ మాజీ ఎమ్మెల్యే కళావతి వైసీపీ సహకారం లేకపోతే కౌన్సిల్లో ఏమీ జరగదని ఇది కూటమి నాయకులకు వీరు సూచించారు. పాలకొండ అభివృద్ధి వరకు తాము రానున్న పది నెలలు సహకరిస్తామని అవినీతికి పాల్పడితే ఎట్టి పరిస్థితులలోనూ వైసీపీ కౌన్సిలర్లు సహకరించాలని వీరు స్పష్టం చేశారు. తమ పార్టీకి చెందిన కౌన్సిలర్స్ అందరూ ఐకమత్యంగా ఉంటూ నైతిక విలువలకు కట్టుబడి మా అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి సూచనల మేరకు కౌన్సిలర్లు అందరూ కట్టుబడి ఉన్నారని కౌన్సిలర్లను అభినందించారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు వెలమల మన్మథరావు మాట్లాడుతూ రానున్న కౌన్సిల్ సమావేశంలో తమ పార్టీ కౌన్సిలర్లు అందరూ పట్టణ అభివృద్ధికి పాటుపడుతూ అధికార పార్టీ ఆగడాలను ప్రశ్నిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వైసిపి కౌన్సిలర్లు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.